క్లుప్తంగా

జాతీయ నాయకుల చిత్రపటాల ఆవిష్కరణ



నెల్లూరు (టౌన్): కొండాయపాళెంలోని దళిత వాడ మున్సిపాల్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ నాయకులు చిత్రపటాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్ఎం భాస్కరరావు జాతీయ నాయకులు దేశానికి అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని వినతి



నెల్లూరు(అర్బన్): మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించి ఉపాధ్యాయ, పీఈటీ పోస్టులను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో జేసీ కూర్మనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. నాలుగేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ లేకపోవడంతో బీఈడీ, టీటీసీ చదివిన లక్షలాది మంది నిరుద్యోగ యువత నష్టపోతున్నారన్నారు. అందువల్ల ప్రభుత్వం తక్షణమే డీఎస్సీ నిర్వహించి పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బాదుల్లా, సర్దార్, సుల్తాన్, కరిముల్లా, గౌస్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

నవాజ్‌ఖాన్‌పేట భూములు కాపాడాలి



నెల్లూరు (అర్బన్): అంబాపురం, నవాజ్‌ఖాన్ పేటలోని ముస్లింల భూములను కాపాడాలని కోరుతూ ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్రాధ్యక్షుడు మహ్మద్‌జియాఉల్‌హక్ మాట్లాడుతూ వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన నవాజ్‌ఖాన్‌పేట భూములను మైనార్టీల సంక్షేమం కోసమే వినియోగించాలని 2008లో ఏపీ ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. 2014లో అప్పటి జిల్లా కలెక్టర్ జానకి సైతం ముస్లింల సంక్షేమానికే వినియోగించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే కొందరు పెత్తందారులు భూములను ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని భూములను కాపాడాలని కోరారు. సంఘ నాయకులు మౌలానా అబ్దుల్ అజీజ్, మహ్మద్ ఉమర్, హనీఫ్, అల్లాఉద్దీన్, షాహుల్, గౌస్‌బాషా, రెహమాన్, షఫీ, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆందోళన

నెల్లూరు(అర్బన్): అంబాపురంలో మాదిగలు వేసుకున్న గుడిసెలను తొలగించడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్రాధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాట్లాడుతూ అంబాపురంలో సర్వేనంబర్ 1-1లో మాదిగలు వేసుకున్న గుడిసెలను అన్యాయంగా తొలగించారన్నారు. కొందరు పెద్దలకు అధికారులు సహకరిస్తూ మాదిగలపై అక్రమంగా కేసులు బనాయించారని ఆరోపించారు. అదే ప్రాంతంలో మూడెకరాలను కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. అంబాపురం స్థలాల విషయంలో మాదిగలకు న్యాయం జరిగే వరకు ఆందోళన చేస్తామని ప్రకటించారు. సంఘ నాయకులు విజయకుమార్, బద్దిపూడి రవీంద్ర, శ్రీనివాసులు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇచ్చి ఆదుకోవాలని వినతి



నెల్లూరు (అర్బన్): ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న 31 మంది ఆప్కోస్ ఉద్యోగులకు జీతాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంధానీ బాషా కోరారు. ఈ మేరకు ఆప్కోస్ ఉద్యోగులతో కలిసి కలెక్టరేట్‌లో జేసీ కూర్మనాథ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. 9 నెలలుగా జీతాలు లేకపోవడంతో ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, కుటుంబ పోషణకు కష్టంగా ఉందని తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణను పలుమార్లు కలిసి విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. కలెక్టర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలన్నారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



శబరి శ్రీరామక్షేత్రంలో శేష వాహనోత్సవం



ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామస్వామి ఆలయంలో హంస వాహనోత్సవం



బాలాజీనగర్ సీతారామస్వామి మందిరంలో గరుడ వాహనోత్సవం



వేదాయపాళెం త్యాగరాజమందిరంలో తిరుచ్చి ఉత్సవం



మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయంలో చంద్రప్రభ వాహనోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఆలయాల్లో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం విశేషాలంకారాల్లో కొలువైన ఉత్సవ మూర్తులను భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

- సంతపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో ఉదయం గిన్నెభిక్ష ఉత్సవం నిర్వహించారు. రాత్రి ఆంజనేయస్వామి గంధర్వ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా బచ్చు రామకృష్ణ, వాకిచెర్ల గోవిందయ్యలు వ్యవహరించారు. ఆలయ ఈఓ జీ దర్గయ్య, మహేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో గరుడ వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా పీ శ్రీనివాసరావు, పీ వసుధారాణి దంపతులు, పీ అన్నపూర్ణమ్మ వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, ఎస్ వెంకటరత్నం, టీ మస్తాన్‌రావు, సభ్యులు పర్యవేక్షించారు.
- ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో ఉదయం సూర్యప్రభ, రాత్రి హంస వాహనోత్సవాలను నేత్రపర్వంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా పెనుబాక గంగాధర్‌రెడ్డి, శోభారాణి దంపతులు, వేమూరు రామమూర్తి, వేమూరు రామశాస్త్రి కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ ఈఓ జీ దర్గయ్య, చైర్మన్ వైవీ రమణ కుమార్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- మూలాపేటలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఉదయం యాళి, రాత్రి చంద్రప్రభ వాహనోత్సవాలను నిర్వహించారు. ఉభయకర్తలుగా పుట్టా నరేంద్రనాథ్‌రెడ్డి, పెంచలలక్ష్మి, ఆర్కాట్ తారాచంద్, రజిని దంపతులు, డాక్టర్ ఇస్కా విజయకుమార్‌రెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ ఈఓ డీ చంద్రశేఖర్‌రావు, చైర్మన్, వ్యవస్థాపక ధర్మకర్త మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- వేదాయపాళెం, త్యాగరాజనగర్‌లోని త్యాగరాజస్వామి మందిరంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఉదయం తిరుమంజనం, సాయంత్రం ఊంజల్, పల్లకిసేవలు నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర సహస్రనామార్చన పారాయణం, జే బాలార్క శిష్యబృందం బృందగానం, రాత్రి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు.



సంతపేట ఆంజనేయస్వామి ఆలయంలో గిన్నెభిక్ష ఉత్సవం

- రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో సంప్రదాయంగా పంగున్యుత్తర మూడో ఉత్సవం నిర్వహించారు. ఉదయం తాయార్లకు తిరుమంజనం, సాయంత్రం స్థల పురాణ పఠనం, రాత్రి ప్రాకారోత్సవం, ఊంజల్‌సేవను వేడుకగా నిర్వహించారు. ఆలయ ఈఓ డీ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఐ శివకుమార్‌ఆచారి, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.
- రాంనగర్ శబరి శ్రీరామ క్షేత్రంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఉదయం ధ్వజారోహణం, హోమం, సాయంత్రం హోమం, బలిహరణ, రాత్రి శేష వాహనోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా పీవీ ప్రసన్నరెడ్డి, స్వర్ణలత దంపతులు వ్యవహరించారు. శ్రీగురుకృప కళాక్షేత్రం సురభి గాయత్రి శిష్యబృందం శాస్త్రీయ, జానపద నృత్యప్రదర్శనలతో అలరించారు.
- పప్పులవీధిలోని ప్రసన్నఆంజనేయస్వామి దేవస్థానంలో శ్రీరాముడి వార్షిక కొతాయి ఉత్సవాలు సోమవారం రాత్రి జరిగిన వడాయత్తు ఉత్సవంతో ముగిశాయి. ఉభయకర్తగా సరాబు వెంకటసురేష్ వ్యవహరించారు. ఆలయ ఈఓ పీవీకే హేమచంద్రరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు రైతు కూలీ సంఘం జిల్లా మహాసభ



మాట్లాడుతున్న రైతు కూలీ సంఘ జిల్లా కార్యదర్శి సునీత

నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న ఏనుగు సుందరరామిరెడ్డి రోటరీ ఆడిటోరియంలో మంగళవారం రైతు కూలీ సంఘం ఉమ్మడి నెల్లూరు జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి సునీత తెలిపారు. సోమవారం సండేమార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సంఘ రాష్ట్రాధ్యక్షురాలు ఝాన్సీ, ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర కార్యదర్శి జాస్తి కిషోర్‌బాబు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. సంఘ నాయకులు, కార్యకర్తలు, రైతు కూలీలు సభలకు హాజరు కావాలని కోరారు. జిల్లా నాయకులు సుబ్బరాయుడు, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎంజీనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నీలగిరిసంఘం విద్యుత్ ఫీడర్‌లో నూతనంగా విద్యుత్ టవర్స్ ఏర్పాటు చేస్తున్నందున మంగళవారం పలు ప్రాంతా ల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని ఐతఈ సెక్షన్ విద్యుత్‌శాఖ ఏఈ లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనరసింహాపురం, రామాలయంవీధి, నెల్లూరురూరల్ తహసీల్దార్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

- నగరంలోని తెలుగుగంగ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్, ఇందిరా గాంధీనగర్ విద్యుత్ ఫీడర్లలో నూతనంగా విద్యుత్ టవర్స్ ఏర్పాటు చేస్తున్నందున మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని ఏఈ లక్ష్మీనారాయణ సోమవారం ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని హౌసింగ్‌బోర్డుకాలనీ, సంజయ్‌గాంధీనగర్, ఇందిరాగాంధీనగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.
- డైకస్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫత్తేఖాన్‌పేట 11కేవీ విద్యుత్ ఫీడర్‌లో విద్యుత్ వైర్లు మారుస్తున్న కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరు వెస్ట్-1 సెక్షన్ ఏఈ లక్ష్మీబాయి సోమవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని టెక్కేమిట్ట పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కత్తితో వ్యక్తి హల్‌చల్



నెల్లూరు సిటీ: నగరంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం మతిస్థిమితం లేని ఓ వ్యక్తి కత్తితో హల్‌చల్ చేశాడు. దీంతో కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు భయాందోళనలతో పరుగులు తీశారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో చిన్నబజారు పోలీసులు కలెక్టరేట్ వద్దకు చేరుకుని అతనిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతనిని కోవూరు ప్రాంతానికి చెందినవాడిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అతని తండ్రి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని తమ బిడ్డకు మతిస్థిమితం లేదని, అనారోగ్యంతో ఉన్నాడని చెప్పడంతో వెంట పంపించారు.

తహసీల్దార్‌పై చర్యలకు డిమాండ్



నెల్లూరు (అర్బన్): పెత్తందారులతో కలిసి తమను ఇబ్బందులకు గురిచేస్తున్న సంగం తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు యానాదులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం జేసీ కూర్మనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన సంక్షేమ సంఘ అధ్యక్షుడు కేసీ పెంచలయ్య మాట్లాడుతూ సంగం మండలం చెర్లోవంగల్లు ఎస్టీ కాలనీలో యానాదుల నివేశన స్థలాల్లో నుంచి మాలకొండయ్య అనే రైతు పొలానికి దారి ఇప్పించేందుకు తహసీల్దార్ కృషి చేస్తున్నారన్నారు. రైతు పొలాల్లోకి దారి చూపాలని కోరితే సర్వే చేయించి రికార్డు ప్రకారం దారి చూపాల్సిన తహసీల్దార్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారన్నారు. యానాదుల ఇళ్లలోని నీరు బయటకు పోనీయకుండా కృషిచేస్తున్న మాలకొండయ్యపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్ చంద్ర, నాయకులు రమేష్ చెంబేటి ఉష, శ్రీనివాసరావు, శీనయ్య పాల్గొన్నారు.

రేపు అయ్యప్పస్వామికి విశేష పూజలు

నెల్లూరు(బృందావనం): అయ్యప్పస్వామి జన్మనక్షత్రం ఉత్తర ఫల్గుణి సందర్భంగా వేదాయపాళెంలోని స్వామి అయ్యప్ప దేవస్థానంలో బుధవారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు స్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు జీ శేషగిరిరావు సోమవారం తెలిపారు. అయ్యప్పస్వామి విశేషాలంకారంలో దర్శనమిస్తారని చెప్పారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. అలాగే ఏప్రిల్ 15న విషు పర్వదినం సందర్భంగా అయ్యప్పస్వామి విశేషాభిషేకాలు, పూజలు, ప్రత్యేకాలంకరణ నిర్వహించనున్నట్లు వివరించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



నెల్లూరు(బృందావనం): జీవుడు దేవునిలో ఐక్యం కావడమే ''శ్రీరామ'' నామ పరమార్థమని త్రైత సిద్ధాంత ఇందూ జ్ఞానవేదిక-ప్రబోధ సేవా సమితి నగర కమిటీ అధ్యక్షుడు సురమౌళి పేర్కొన్నారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా హరనాథపురం ప్రాంతంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత విశిష్టతను వివరించారు. సంస్థ సభ్యులు కేవీరత్నం, ఎం సుధాకర్‌ఆచారి, జీ నరసింహప్రసాద్, పీ ప్రదీప్, ఎం పద్మజ, ఎస్ మనోజ, కే విజయలక్ష్మి, సోమశేఖర్, సునీల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా...



నెల్లూరు(సెంట్రల్): విజయవాడలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి

నెల్లూరు రూరల్: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ పాటు పడాలని కొమ్మరపూడి వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు వల్లభనేని రమణమ్మ పిలుపునిచ్చారు. సోమవారం ఆమె పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. స్థానికంగా ఉన్న సమస్యలను రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామన్నారు. నాయకులు రాగయ్య, శివ, ప్రసాద్, రఫీ, మురళి, సుబ్రహ్మణ్యం ,వెంకటేశ్వర్లు, సుధాకర్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



స్పందన అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ హరిత

నెల్లూరు(బారకాసు): స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కార్పొరేషన్ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్‌కు 32, స్పందనకు 22 విజ్ఞప్తులు అందాయి. కార్పొరేషన్ అధికారులతో కలిసి కమిషనర్ నగర ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్పందన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదన్నారు. టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారంలో జాప్యంపై సంబంధిత అధికారులపై మండిపడ్డారు. ఇకపై అలా జరగడానికి వీల్లేదని, తమ దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. వాణిజ్య ప్రకటనల పన్నులు చెల్లించని హోర్డింగులను తొలగించాలని ఆదేశించారు. వర్తక వాణిజ్య దుకాణాల అన్నింటికి ట్రేడ్‌లైసెన్స్‌లు మంజూరు చేసి పన్ను పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. జనవాసాల మధ్య పందుల సంచారాన్ని నియంత్రించాలని, ప్రత్యేక ప్రదేశాలకు వాటిని తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ, ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

బెంగాలి హిందువులకు రక్షణ కల్పించాలి

నెల్లూరు (అర్బన్): నగరానికి వలస వచ్చి జీవిస్తున్న బెంగాలి హిందువులకు రక్షణ కల్పించాలని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జేసీ కూర్మనాథ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. పొట్టకూటి కోసం వలస వచ్చి వ్యాపారాలు చేసుకుంటున్న బెంగాలివాసులను ఓ వర్గం వారు విడిచి వెళ్లాలని దౌర్జన్యం చేస్తున్నారన్నారు. శ్రీరామనవమి నాడు వారిపై దాడులు జరుగగా సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. అందువల్ల వారికి రక్షణ కల్పించాలని కోరారు. బీజేపీ నాయకులు రత్నం నాయుడు, సాయి శ్రీనివాసులు, నారాయణ, సుధాకర్, కృష్ణ, రాంబాబు, శివ, కేశవ, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్ పరిధిలోని నల్లకాలువ,పునరావాసకాలనీ, వెంటేశ్వరపురం పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం పింఛన్ల పంపిణీ చేపట్టారు. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఆమంచర్లలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుకన్య



కనుపర్తిపాడులో బహుమతుల పంపిణీ

నెల్లూరు రూరల్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని బుజబుజనెల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ స్వరూప అన్నారు.కనుపర్తిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్‌బేబి షో నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే అంబాపురం సెక్టారులోని ఆమంచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ సుకన్య పాల్గొని పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలని వినతి



నెల్లూరు(అర్బన్): మూలపేటలోని శ్రీకృష్ణధర్మరాజస్వామి గుడివద్ద అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను తొలగించాలని జిల్లా అగ్నికుల క్షత్రియ సంఘం ప్రధాన కార్యదర్శి తిరువత్తూరు శివశంకర్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జేసీ కూర్మనాథ్‌కు సంఘ నాయకులతో కలిసి సోమవారం ఆయన వినతి పత్రం అందజేరు. గతంలోనూ స్పందనలో అక్రమ నిర్మాణాలపై అర్జీలు ఇచ్చినా అధికారులు స్పందించలేదన్నారు. దేవాదాయ శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టేలా ఆదేశాలివ్వాలని కోరారు. నాయకులు కంచి జ్ఞానేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడిపై దాడి

నెల్లూరు సిటీ: మద్యానికి నగదు ఇవ్వలేదని స్నేహితుడిపై దాడికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కిసాన్‌నగర్, సింహపురికాలనీకి చెందిన మదన్, చిన్నా, మధు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం కిసాన్‌నగర్‌లోని ఓ బార్‌లో మద్యం తాగారు. మదన్, చిన్నా వద్ద నగదు అయిపోవడంతో రూ.300 ఇవ్వాలని మధును కోరారు. మధు నగదు ఇచ్చేందుకు నిరాకరించడంతో వారి మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో రాయితో మధును కొట్టడంతో తలకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అపహరణ

నెల్లూరు సిటీ: స్నేహితుడి ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ అపహరణకు గురైన ఘటనపై బాధితుడు నవాబుపేట పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. వివరాలు..నవాబుపేటలో నివాసం ఉంటున్న మనోహర్ ఈ నెల 2న నేతాజీనగర్‌లోని తన స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. ఇంటి ఎదుట బైక్‌ను పార్కింగ్ చేసి ఇంట్లోకి వెళ్లి వచ్చి చూడగా కనిపించలేదు. బైక్ కోసం చుట్టపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో నవాబుపేట పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నివేశన స్థలాలు మంజూరు చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

నెల్లూరు (అర్బన్): నగర శివారు ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను పేదలకు నివేశన స్థలాలుగా మంజూరు చేయాలని సీపీఎం సీనియర్ నేత మాదాల వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు సీపీఎం రూరల్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో వీఆర్సీ సెంటర్‌నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి డీఆర్వో వెంకటనారాయణమ్మకు వినతిపత్రం అందజేశారు. వావిలేటిపాడు, కల్లూరుపల్లి, గుండ్లపాళెం, తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను నిరుపేదలకు తక్షణమే పంచాలని డిమాండ్ చేశారు. పార్టీ రూరల్ నియోజకవర్గ కార్యదర్శి బత్తల కిష్టయ్య, నాయకులు కిన్నెర కుమార్, వీర్ల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.